# అగ్ని

రామాచంద్రమౌళి



సూర్యుడు పూర్తిగా అస్తమించాడు.

పడమటి ఆకాశంవంక చూశాడు విక్కా.

నల్లగా చీకటి....చీకటి....చీకటి.

కళ్ళనిండా, మనసునిండా, బ్రతుకు నిండా....ఎటుచూస్తే అటు—

అంతా చీకటే.

చూపులు ఆకాశంలో నుంచి జారి భూమిపై బడి.... గోడకు తాకి వస్తున్న బంతిలా మళ్లీ కళ్లలోకి ఉరికొస్తూ—

లంబాడి గూడెం నిండా గంప క్రింద కోడిపిల్లల చప్పుడులా సందడిగా ఉంది. గుడిసెలన్నీ పెద్ద పెద్ద చీకటిముద్దల్లా ఉన్నాయి. కుక్కలు బిగ్గరగా అరు స్తున్నాయి ఎక్కడి నుండో. గాలి నిండా పొయ్యిల్లో ఏదో పొరక కాలు స్తున్న బాపతు వెగటు వాసన.... పొగ కళ్లలోకి చొచ్చుకుపోయి నిండా నీళ్ళు—

వాకిట్లో నిలబడిన వాడల్లా వంగి గుడిసెలోకి చూశాడు అసహనంగా.

గుడ్డిదీపం వెలుగులో— చుక్కి మంచంపై—

చుక్కి యింకా నొప్పులు పడుతూనే ఉంది. ప్రక్కన యిద్దరు ముసలి ఆడ పెద్దమనుషులు చుట్టతాగుతూ యింకా నిరీక్షిస్తూనే ఉన్నారు.

భిక్యా తుపుక్కున ఉమ్మేసి— "ఏందే— పగటీల్నుంచి. యింకెంత సేపైద్ది...." అని తనలో తాను గొంబ కున్నట్టుగా—బయటికి కొస్త వినిపిం చేట్టుగా అన్నాడు. అతని మాట గుడిసె లోకి వినబడలేదు.

యీలోగా ఓ ముసల్ది ఒంటి నిండా కప్పుకున్న మాసిన దుప్పటిని సర్దుకుంటూ కలుగులోనుంచి ఎలుకలా తొంగిచూసి "అరే ఓ భిక్యా...." అని బలంకొదీ పిలిస్తే— ఆమె మాట అతి మెల్లగా వినబడి.... రెండడుగులు అతను నడిచి—

"పిల్ల పరిస్థితి బాగాలేదు. కడుపుల పిండం అడ్డం తిరుతాగున్నట్టున్నది. కొన్ని యీడైతే ఏమన్నా కీడైతదో ఏమో పట్నం తీస్కపో బిడ్డా దబ్బున."

పట్నంకా—

దబ్బున.... ఎట్ల.... ఎట్ల.... తీస్క పోవాలె?

గబగబా గుడిసెలోకి పరుగెత్తి—

చుక్కి గోడను పట్టుకుని నిలబడి.... నొప్పితో నుడి తిర్గిపోతూ.... ఆమె ముఖం నిండా చెమటలు వరదలా కారు తున్నాయి. అరుస్తోంది దేవున్ని తలుచు కుంటూ—

"యింకా అలస్యం చేస్తే మంచిది కాదురా.... బయల్దేరు" యింకో ముసల్ది.

కాని ఎలా యిప్పుడామెను తీస్క పోవడం.

గిరుక్కున వెనక్కు తిరిగి— పరుగెత్తి.... "ఒరేయ్ రతన్, మంగూ, ఛానూ...." అరుస్తూ.... గుడిసెల్లోకి చొచ్చుకుపోతూ—

ఐదు నిముషాల్లో నలుగురు మనుష లను తీసుకుని వచ్చాడు తిరిగి—

వచ్చి - అందరూ కలసి ఓ నులక మంచపై దుప్పటి పరిచి సిద్దంచేసి —

"పైకం తెచ్చుకుంటున్నావ్రా భిక్యా—"

"ఆఁ అన్ని కల్సి దెబ్బయున్నయ్"

"సరే పా.... పాండ్లిరా—"

"పా.... పా"

చుక్కని నడిపించుకచ్చి మంచంలో పడుకోబెట్టి—

యింకో ఐదారుగురు గుమిగూడారు- గుసగుస .... వాకిట్లోకి బుడ్డిదీపాలు చేరాయి.

మంచాన్ని నలుగురు కలిసి లేబట్టి- ఒక్కొక్కరు ఒక్కో కోడును భుజం పై పెట్టుకుని- బయలుదేరారు.

పైన చుక్క- చుక్కలవంక చూస్తూ కడుపులో అగ్నిపర్వతాన్ని మోస్తోంది.

నడక....నడక.....ఒకటే నడక

ఒకటే తపన- 'పట్నం చేరాలె'

ఒకటే తాపత్రయం— "మనిషి బ్రతకాలె."

పరుగు—

ఆమెకెలాంటి అవస్థా కలుగకుండా- పరుగు.

ఒకటి.... రెండు....

మూడు గంటలు దాటాక—

పట్నం పసివాడికి పాలపూతలా అందింది వాళ్ళకు.

ఎవరినో అడిగి....ఎందరితో నో ఛీత్కారం పొందుతూ— ప్రసూతి దవాఖాన ఉన్న చోటును కనుక్కొని.... స్వర్గానికి చేరుకున్నట్టు సంబరపడి పోతూ—

దవాఖాన - చీకట్లో.....నిశ్శబ్దంగా.... నిద్రిస్తున్న పాములా గంభీరంగా భయంకరంగా ఉంది.

గేట్ దగ్గర కాకీబట్టలు వేసుకున్న మనిషి అల్సేషియన్ కుక్కలా చురుగ్గా మొరుగుతూ- పడిపోబోయే రబ్బరు బొమ్మలా ఊగిపోతున్నాడు.

భిక్యా పేషంటును లోపలికి తీసుకు పోవాలన్నాడు అతి దీనంగా.

వీ ల్లేదన్నాడు వాచ్ మన్.

మరి ఎట్ల- అంటే,

"యీ అరుగుల మీదనే నీ పెండ్లాంను నీళ్ళాడమన్నా గాడ్దికొడ్కా-" అన్నాడు.

"అయ్యయ్యా - నీ బాంచెను కాల్మొక్త.... పానం పోయేటట్టున్నది పోనీయ్ లోపల్కి-" అని తలను కడుపులో పెడితే-

ఒడిలోకి ఓ గజ్జికుక్క వచ్చిపడ్డట్టు కసురుకుని- "ఐతే ఓ ఐదు పారేయ్ బే" అన్నాడు.

భిక్యా చెవులనిండా.... చుక్క- అరుపులు.... ఏడ్పులు.... మూల్గులు—

జేబులో చుట్టి దాచిన దెబ్బయిలో నుంచి ఐదురూపాయల నోటు తీసి- యివ్వబోతే-

"నా పేరు రసూల్ బే.... కాని నన్నంత వసూల్ అంటారు-ఊ పెట్టు దీంట్లో" అని జేబు తెరచి పట్టుకుని-

సారా వాసన గుప్పుమంది,

ఐదు జేబులో కుక్కి-

గేట్ తెరుచుకుంది-

చుక్కని మెల్లగా నడిపించుకు లోపలికి తీసుకుపోయి-

మసిగుడ్డల్లా ఉన్న వాళ్ళను చూసి- నర్స్ మూతి ముడుచుకుని ఎటో వెళ్ళి పోయింది. లేడి హౌజ్‌సర్జన్ తలెత్తి ఓ పురుగును చూచినట్టు చూచి- మళ్ళీ చేతిలోని యింగ్లీష్ నవలలో మునిగి పోయింది

డ్యూటీ డాక్టర్ మాత్రం అప్పుడే ప్రత్యక్షమైన దేవతలా ప్రసన్నంగా నవ్వి పలకరించి, బీదవాళ్ళను ఉద్ధరించడానికి మాత్రమే పుట్టినవానిలా అన్నీ అడిగి- అడ్మిట్ చేసుని .... పరీక్షించి—

"యీామెకు వెంటనే అపరేషన్ చేయాల్లా" అని నర్స్‌తో యింగ్లీష్‌లో ఏదో చెప్పిండు.

వెంటనే నర్స్ చుక్కాని స్ట్రెచర్ పై ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకుపోయి- హౌజ్‌సర్జన్. నవలలోనుంచి చంగున బయటపడి.... అంతా అప్పుడే కరెంటును పొందిన బల్బులా-

బిక్యా సంతోషంతో ముడుచుకుపోయి అతివినయంగా ఓ గోడవార నిలబడ్డాడు.

థియేటర్ తలుపులు మూసుకున్నాయి

ఈ లోగా రసూల్ గాలిలా వచ్చి "యింకేందిరా .... యిగ బైటకు పా" కర్రతో నెట్టుకొచ్చి-

అరుగుపై నిలబడి కనబడని లోపలి ఆపరేషన్ థియేటర్ దిక్కు తొంగి తొంగి చూస్తూ-

"బిక్యా ఎవరు" అని ఓ స్త్రీ కంఠం వెనుకనుంచి వినబడితే- చటుక్కున వెనుదిరిగి-

ఎదురుగా ఇంతకు ముందటి నర్స్.

"నువ్విట్రారా-" అంది.

వెంటనే నడిచాడు.

కాస్త చీకట్లోకి నడిచి- "అమ్మగారు ఆప్రేషన్ చేస్తరు. యాభై రూపాయ లియ్యాలె నువ్వు వెంటనే- లేకుంటే నీ పెండ్లాం సచ్చిపోతది-"

"యిది సర్కార్ దావకాన కాదండి"

"గందుకనే యాభై .... లేకుంటే ఐదువందలా-"

"మరి నాదగ్గర గివ్వేఉన్నాయ్" అని అన్ని నోట్లుతీసి ఆమె ముందర విప్ప పట్టుకుని-

ఆమె యాభై తీసుకుని- ఓ పదిరూపాయల నోటును జాకెట్లో సర్దేసి- మిగతావి పట్టుకుని "నువ్వు అర్జంటుగ గాంధి దావఖానకు పోయి నీ పెండ్లాంకోసం గీ రక్తంసీస తీస్కరా. ఆమె కెక్కియాలె. లేకుంటే డేంజర్.... వెంటనే ఎల్లు-" అని మెరుపులా వెళ్ళిపోయింది, ఓ చీటివి అతని చేతిలో కుక్కి.

దేవతలా ఉన్న ఆ డాక్టరమ్మ కూడా లంచం తీస్కుంటదా-

గేట్ కాడోడు....సిస్టరమ్మ .... డాక్టరమ్మ....ఐదు .... పది .... యాభై .... అందరూ లంచాలే—

కాని రక్తం....

ఎక్కడ తేవాలె. ఎక్కడ దొరుకుతదది....

చేతిలో ఆమె ఉంచిపోయిన చిట్టీని దోసిట్లో పడ్డ పామును చూసినట్టు భయంగా చూచి –

"ఎట్ల —"

"ఆ రసూల్‌కే చూపింద్రా" అని మంగూ అంటే –

రసూల్ దగ్గరకు ఉర్కి–చెప్తే–

వాడు ఊగి....పడిపోబోతూ నిబాయించుకుంటూ — "సూద్రూపాల్ తేపో...నెత్తురు తీస్కత్త...." అన్నాడు.

"అయ్య .... సూర్లెవ్వ. పదిఏనే ఉన్నై."

"పదిఏనుంటే మల్సుకోని పెట్కోపోటే....పో" అని బిక్యాను నెట్టేసి — తుపుక్కున కాండ్రించి ఉమ్మేసి –

ఎట్ల ....నెత్తురు లేకపోతే చుక్కి సచ్చిపోతదా....

కాని నూరు. నూరు...నూరు –

"అయ్యా ... నా దండ కడెమున్నది. దీన్ని తీస్కోని యీ నెత్తురిస్తరా." అన్నాడు.

రసూల్ ఉలిక్కిపడి...అతని దండకున్న వెండికడేన్నిచూచి .."అఁ ఇప్పిస్త పా ఇటియ్యి దాన్ని...." అని తీస్కోని–

"పా ... నా యెంట. ఏయ్ రిక్షా."

రిక్షా ఎక్కారు యిద్దరూ.

మిగతా ముగ్గురు బయటనే కూలబడిపోయి –

ఓ పావుగంట తర్వాత రిక్షా ఓ పెద్ద భవనం ముందాగి–"అరే బిక్యా... నువ్విక్కడనే కూకోరా. నేను లోపలికి వెళ్ళి రక్తం పట్కస్త–నేను వచ్చేదాన్క ఏడికిపోవద్దు —" అని రసూల్ దిగి – లోపలికి వెళ్ళిపోయి,

బిక్యా–ఓ చెట్టుక్రింద కూలబడి –

చుక్కి .... ఏడ్పులు .... నొప్పులు ఆప్రిషన్ అంటే కడుపును కోస్తరా.... కోసి కడుపులనుంచి పాపను తీసి —

తనకు పాప —ఓహ్.

సంతోషం పొంగింది గుండెలో.

కాని రక్తం .... రక్తం.... రక్తం కావాలి తొందరగా....లేకుంటే చుక్కి చచ్చిపో....

చూస్తున్నాడు కళ్ళనిండా ప్రాణాలతో.

రసూల్ యింకా రావడంలేదు.

అరగంట....గంట....రెండుగంటలు ....మూడు గంటలు —

ఎవరెవరో వస్తున్నారు పోతున్నారు కార్లలో.

కాని రసూల్ ....ఏడీ.

ఎవరో పోతూంటే –"టైమెంతయిందొర్" అని అడిగితే —

"మూడు –"

"గీ దావఖాన్ల యింకా మనుసులున్నారా దొరా."

"ఏ దావఖాన్లరా."

"గీదింట్ల" అని ఆ పెద్ద బిల్డింగ్‌ను చూపెట్టి,

వాడు బిగ్గరగా నవ్వి....నవ్వి–" అరే

దీవానా....యిది దావ్‌ఖాన కాదు. బార్...
అంటే బాగా తాగి తందనాలాడేది....
పోరా ఎర్రినాకొడకా" అని తూగుతూ
వెళ్ళిపోతూ —

తాగుతూ.... తందనా....

అంటే రసూల్ లోపల అప్పట్నించీ
తాగుతూ.....దేవుడా .... ఓ దేవుడో -

లోపలికి పరుగెత్తాడు ఏడుస్తూ —

మెట్లదగ్గర పడున్నాడు రసూల్
స్పృహ తప్పి. చేతులూ, జేబులూ అన్నీ
వెదికితే ఎక్కడా కడియం లేదు. రక్తం
చిట్టీ లేదు.

ఎలా....ఎలా....ఎలా.

బయటకి ఉరికొచ్చి రోడ్డమ్మట
పిచ్చిగా పరుగెత్తి —

ఎవర్నో అడిగి-ఎవరెవర్నో అడిగి-
ఎప్పుడో దవాఖానకు చేరి -

గేట్‌దగ్గరనే నేలమీద నిండా గుడ్డ
కట్టిన మనిషి చుట్టూ మసక వెలుగులో -

మంగూ, భానూ, రతన్ - నీడల్లా
ముఖాలనిండా చీకటితో....,

మెల్లగా వెళ్ళి ప్రక్కన నిలబడి....
పిచ్చిగా.... వెర్రిగా....

"అరే బిక్యా నీ పెండ్లాం పోయింద్రా.
నువ్వు తెచ్చే నెత్తురుకోసం చూచి చూసి
బపోయింది....యిగో నీకు కొడుక్కవిచ్చి
పోయింది...."

చూస్తున్నాడు శిలవలె.

నెత్తురు.....రసూల్.....బార్.... ఐదు
పది.... యాభై ....వెండి కడెం -

పద్మవ్యూహంలాంటి పట్టణంలో
ఏమీ తెలియని తను....

తన యీ తెలివితక్కువ తనానికీ,
పశువులాంటి ఓ మొద్దును చేసుకు
న్నందుకు - చుక్క- చుక్కల్లో కలిసి ...

ప్రక్కన లేత ఏడ్పు. ఏడుస్తున్నాడు
పసివాడు పొత్తిగుడ్డల్లో.

మసక చీకటిలో వాని ముఖం లీలగా
కనబడ్తూ—

వీడు పెరిగి ఏమౌతాడు....

తనో మొరటు గొడ్డు. వీడూ గొడ్డే.
తనో పశువు. వీన్ని ఇంకో పశువును
తయారుచేస్తూ....వీనికీ చుక్కని చేసి....
దాన్ని చంపిచ్చి -

తనలాంటి అమాయకున్ని గొడ్డును
పట్నంలోని ఈ క్రూరమృగాలు బ్రతక
నీయవు - చంపుకు తింటాయి....అందుకే
అందుకే -

వంగి పసివాని పైన వంగి....ఏడ్చే
ముఖంపై అరచేయివి అదిమి ముక్కు
మూసి —

ఏడ్పు ఆగిపోయింది.

అతని గుండెలో సముద్రాలు అరు
స్తున్నాయి కోట్ల గొంతులతో.

అచేతనంగా ఉన్న చుక్క ముఖం
లోకీ, పసివాని ముఖంలోకీ చూచి
తలెత్తి ఆకాశంలోకి చూశాడు. ఆకాశం
నిండా చిక్కగా చీకటి....చీకటి...చీకటి.

ఇంకా సూర్యోదయం కాలేదు.

———